ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 341 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 21 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## రూ.3,24,234 కోట్లతో
# తెలంగాణ బడ్జెట్

తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రసంగాన్ని ప్రారంభించారు. రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేడ్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

హైదరాబాద్, మార్చి 20 (ప్రభాత ఉదయం)

2





## ఆరు గ్యారెంటీలకు
# సమాధి కట్టారు

**బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం**

**మహిళల పెన్షన్‌పై మాట్లాడని బడ్జెట్**

**పేదలపట్ల చిత్తశుద్ధి లేని బడ్జెట్ ఇది**

**భట్టి కేటాయింపులపై హరీష్ రావు పెదవివిరుపు**

హైదరాబాద్, మార్చి 20 (ప్రభాత ఉదయం)

తెలంగాణ బడ్జెట్‌పై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు పెదవిరిచారు. ఇదొక ఝూటా బ్జడెట్ అని, బోగస్ బడ్జెట్ అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను, ఆర్టీసీ కార్మికుల సమస్యలను, నిరుద్యోగల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చిన పించన్ పెంపు హామీలను కూడా సర్కారు మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇందులో సకలజనుల దక్కింది గుండు సున్నా తప్ప ఏమీ లేదని హరీశ్‌రావు విమర్శించారు. అంకెలగారడీ, మాటల గారడీ తప్ప ప్రభుత్వానికి పేదలపట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనే విషయం ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజలకు అభయహస్తమని హామీ ఇచ్చారని, ..మిగతా 2లో

## ఎరువుల సరఫరాను
# నిలిపేయనున్న చైనా

**ఎరువుల ఉత్పత్తికి ఇంధన పోటు**

**భారత్ తదితర దేశాలకు రవాణ ఆపే చర్యలు**

**పలుదేశాల వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం**

న్యూఢిల్లీ, మార్చి 20 (ప్రభాత ఉదయం)




ముడి చమురు సరఫరాలో అవాంతరాలతో ఇక్కట్ల పాలవుతున్న ప్రపంచదేశాలకు కొత్త సమస్య వచ్చి పడేటట్టు ఉందన్న భయాలు నెలకొన్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ప్రపంచంలోని అతిపెద్ద ఎరువుల ఎగుమతిదారుల్లో ఒకటిగా ఉన్న చైనా యుద్ధ ప్రభావం వల్ల.. జెట్ ఇంధనం, డీజిల్, ఎరువుల ఎగుమతులపై పలు నిబంధనలు విధించడానికి చర్యలు తీసుకుంటోంది. దీంతో ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ..మిగతా 2లో

# విద్యా విధానంలో మార్పులు

## ఇక టెన్త్ పరీక్షలు ఉండవు: రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్, మార్చి 20 (ప్రభాత ఉదయం)

ఫోన్ ట్యాపింగ్ అరెస్టులు, సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి వ్యవహారం, విద్యా విధానం అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడిన ఆయన, విద్యా విధానంలో కీలక మార్పులు తెస్తున్నామని స్పష్టం చేశారు. ఇక టెన్త్ పరీక్షలు ఉండవని చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విధానం ఉంటుందని, దీనిని ముమ్ముందు అమలుచేస్తామని అన్నారు. మూసీ ప్రక్షాళన ఆగదని, ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. జగిత్యాలకు చెందిన తమ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి వ్యవహారాన్ని టీపీసీసీ అధ్యక్షుడు, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ చూసుకుంటారని తెలిపారు. అటు, ..మిగతా 2లో

## ఆరు గ్యారెంటీలపై
# సభలో నినాదాలు

**బడ్జెట్ ప్రతులను చించేసిన బిఆర్ఎస్**

**బడ్జెట్ బహిష్కరిస్తూ వాకౌట్**



హైదరాబాద్, మార్చి 20 (ప్రభాత ఉదయం)

తెలంగాణ అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా మోసమని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మండిపడింది. బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు ప్రతులను చింపిపారేశారు. అనంతరం సభ నుంచి వాకౌట్ చేశారు. దాంతో అసెంబ్లీలో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌కు నిరసనగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ..మిగతా 2లో



# తగ్గని ఉద్రిక్తతలు

**అమెరికా , ఇజ్రాయిల్‌లకు మద్దతు ఇస్తే దాడులు తప్పవు**

**గల్ఫ్ దేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు**

టెహ్రాన్, మార్చి 20 (ప్రభాత ఉదయం)

మధ్యప్రాచ్యంలో యుద్ధ ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరిన తరుణంలో, ఇరాన్ తన పొరుగు దేశాలకు కీలక విజ్ఞప్తి చేస్తూనే పరోక్ష హెచ్చరికలు జారీ చేసింది. తమపై దాడులు చేయడానికి అమెరికాకు, ఇజ్రాయెల్‌కు ..మిగతా 2లో



# నేడు పవిత్ర రంజాన్ పండగ

**ముగిసిన రంజాన్ ఉపవాసాలు**

హైదరాబాద్, మార్చి 20 (ప్రభాత ఉదయం)

పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. చివరి శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గురువారం నెలవంక దర్శనం లేకపోవడంతో శుక్రవారం నెలవంక ఆధారంగా శనివారం రంజాన్ పండగను నిర్ణయించారు. దీంతో నెల రోజుల ఉపవాస దీక్షలను విరమించి పండగను జరుపకోబోతున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో 9వ నెల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం. ఈ పవిత్ర మాసంలో ముస్లింలు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండి ప్రార్థనలు ఆచరించారు. ఖురాన్ పఠించారు. ముఖ్యంగా ఈ మాసంలో దానధర్మాలు విరివిగా చేస్తారు. పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ఆత్మ పరిశీలనకు, స్వీయ క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇలా నెల రోజుల ఉపవాసాల ఆనంతరం నెలవంక కనిపించిన తర్వాత ఈద్ అల్ ఫితర్ అంటే రంజాన్ పండుగ జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే అతిముఖ్యమైన ..మిగతా 2లో

## రూ.3,24,234 కోట్లతో

# తెలంగాణ బడ్జెట్

హైదరాబాద్, మార్చి 20 (ప్రభాత ఉదయం)

తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 తెలంగాణ బ్జడెట్‌లో 'ప్రజా క్షేమం సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు సాగింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌలిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు.రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ అంటే అంకెల చుట్టూ తరిగడం కాదని, అభివృద్ధి సంఖ్యలను ఆవిష్కరించ డమని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము చేస్తున్న కృషికి బడ్జెట్ తార్కాణమని, గత రెండేళ్ల అభివృద్ధి ఇందుకు నిదర్శనమని అన్నారు. మొత్తం బడ్జెట్.. రూ.3,24,234 కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లుగా చూపారు. బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే.. 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటాయించారు. బడ్జెట్ లో 5 కీలక రంగాలకు భట్టి ప్రాధాన్యతనిచ్చారు. వ్యవసాయం, రైతు సంక్షేమం రూ. 23,179 కోట్లు కేటాయించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ



పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్రతాంబూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సర్కారు విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకుల పాఠశాలల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు భారీగా నిధులు కేటాయించారు. ప్రజా పాలన - ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), రూ. 500 కే గ్యాస్ సిలిండర్ వంటి ఆరు గ్యారెంటీల అమలుకు అవసర మైన నిధులను పుష్కలంగా కేటాయించారు.. మౌలిక సదుపాయాలకు గాను మూలధన వ్యయం రూ. 47,267 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గత పాలనలో ఆగిపోయిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. సామాజిక భద్రత లోబీమా పథకాలను చేర్చారు. ప్రతి పేద కుటుంబానికి ధీమా కల్పించేందుకు 'ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం' కింద రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడం ఈ బడ్జెట్‌లో ఒక కీలక అడుగుగాభావించాలి. జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటించారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందచేస్తారు. ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకారవేతనం ఇస్తారు. రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన చేపట్టారు.. కేటాయింపులను పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు, విద్యా శాఖకు రూ.26,674 కోట్లు, వైద్య శాఖకు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లు, మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు, పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు, ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు, బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు, మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు, కల్యాణ లక్ష్మీ పథకం.. రూ.3,683 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు, యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీ కి రూ.వెయ్యి కోట్లు, మెట్రో రైలు ఫేజ్-2.. రూ.600 కోట్లు, మహాలక్ష్మి గ్యాస్ సబ్సిడీ పథకం.. రూ.723 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ.. రూ.1143 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్.. రూ.3500 కోట్లు, మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు, రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు, ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటయిస్తున్నట్లు భట్టి ప్రకటించారు.

## ఆరు గ్యారెంటీలకు సమాధి కట్టారు

మొదటి పేజీ తరువాయి...

ఇప్పుడు మూడో బడ్జెట్‌లో కూడా రిక్తహస్తమే మిగిల్చారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లు కాలేదుగానీ మూడున్నర లక్షల కోట్లు అప్పులు చేసిందని, తెచ్చిన ఆ అప్పుతో ఏం చేశారని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడితే.. కాంగ్రెస్ తన రెండున్నరేళ్ల పాలనలో వెనుకపడేసిందని హరీష్‌రావు విమర్శించారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా భట్టి అంబేద్కర్ సూక్తులు, రాజ్యాంగ విలువలను వల్లెవేశారని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను వెనుక కూసోబెట్టుకుని రాజ్యాంగ విలువల గురించి ఆయన మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క గోరీ కట్టారని దెప్పిపొడిచారు. ఈ బ్జడెట్‌ను చూస్తే ఎన్నికల హామీలపై కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమైందని అన్నారు. గతం కంటే 20పేజీలు పెంచారు తప్ప.. హామీలకు కేటాయింపులు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారని ధ్వజమెత్తారు. సీఎం ప్రజలకే కాదని.. ఎమ్మెల్యేలకు సైతం అందుబాటులో ఉండటం లేదని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 3లక్షల పింఛన్లు కట్ చేసి.. 2లక్షల కొత్త పెన్షన్లు ఇస్తామంటున్నారని అన్నారు. కోటీశ్వరులు సంగతి అటుంచి.. మొదట మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్, ఇందిరమ్మ పేర్లతో అమలవుతోన్న స్కీంలకు సైతం కేటాయింపులు ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్‌ది.. అభయ హస్తం కాదని.. రిక్త హస్తమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది మూడు ముక్కలాట తప్ప.. విజన్ లేదని దెప్పిపొడిచారు. బ్జడెట్‌లో అన్నివర్గాలకు మొండి చెయ్యి చూపారని ఆగ్రహించారు. మూడున్నర లక్షల కోట్లు అప్పులు తెచ్చి.. రేవంత్ చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో సచివాలయం, కాళేశ్వరం, చెక్ డ్యాంలు కట్టామని ప్రస్తావించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను వెనుక కూర్చోపెట్టుకుని భట్టి.. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహించారు. కాంగ్రెస్ హయాంలో స్కాంలు తప్ప.. స్కీంలు లేవని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో స్కాం జరిగిందని మంత్రి బిడ్డ స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. గురుకుల పిల్లలకు కడుపు నిండా అన్నం పెట్టలేని సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడేమో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంటున్నారని దెప్పిపొడిచారు. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వానివి కట్టుకథలని విమర్శించారు. అక్రమ సంపాదన దాచుకోవటానికే ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. మూడుసార్లు రైతుబంధు ఎగొట్టినందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పాలన గాడి తప్పటం వలనే తలసరి ఆదాయం తగ్గిందని అన్నారు. పారిశ్రామికవేత్తలకు తుపాకులు పెట్టి మాముళ్లు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి యాదాద్రిని మూసేస్తామంటే.. భట్టి ఏమో యాదాద్రి తెలంగాణకు గర్వకారణమని అంటున్నారని అన్నారు. సింగరేణి గురించి కాంగ్రెస్‌కు మాట్లాడే హక్కు లేదన్నారు. సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారని హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నేడు పవిత్ర రంజాన్ పండగ

మొదటి పేజీ తరువాయి...

పండుగల్లో రంజాన్ అత్యంత ప్రధానమైనది. ఎంతో భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలతో రంజాన్ పండుగను ఆచరించారు. ముస్లిం ఆచరించే చంద్రమాన క్యాలెండర్‌లో రంజాన్ లేదా రమాదన్ అనేది తొమ్మిదో నెల. ఈ రంజాన్ పండుగ ఆధ్యాత్మిక చింతన, దానధర్మాలు, క్రమశిక్షణ వంటి వాటికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ రంజాన్ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని ముస్లిం పండితులు చెబుతారు. సాధారణంగా సౌదీ అరేబియాలో నెలవంక కనపించిన తర్వాతి రోజు భారత్‌లో రంజాన్ మాసంప్రారంభం కావడం అనేది ఆనవాయితీగా వస్తోంది. ఇక రంజాన్ పండుగ మార్చి 20 తేదీన నెలవంక దర్శనం ఆధారంగా జరుపుకుంటున్నారు.

## ఆరు గ్యారెంటీలపై సభలో నినాదాలు

మొదటి పేజీ తరువాయి...

నుంచి వాకౌట్ చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బ్జడెట్ ప్రసంగం ప్రారంభించగానే.. బీఆర్ఎస్ సభ్యులు వినూత్న రీతిలో తమ నిరసన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ప్రజలను 'చెవిలో పూలు' పెట్టి మోసం చేస్తోందంటూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ చెవుల్లో పూలు పెట్టుకుని సభ నుంచి బయటికి వచ్చారు. ముందుగా బ్జడెట్ ప్రసంగం మొదలవగానే.. ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేశారు. ముఖ్యంగా 'ఆరు గ్యారంటీల' అమలు తీరుపై వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం సభ నుంచి బయటికి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభ ఎంట్రీ వద్దకు చేరుకుని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 'తులం బంగారం మోసం మోసం' అని నినాదాలు చేస్తూ ప్రభుత్వం పేద మహిళలను వంచించిందని విమర్శించారు. 'రెండు లక్షల ఉద్యోగాలు మోసం మోసం' అని నినదిస్తూ యువతకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవడం లో విఫలమైందని మండిపడ్డారు. ఇక 'బ్జడెట్ మోసం మోసం' అని నినాదాలు చేస్తూ ఈ బ్జడెట్‌లో పేదలకు, రైతులకు, మహిళలకు ఎలాంటి న్యాయం జరగలేదని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు.

## ఎరువుల సరఫరాను నిలిపివేయనున్న చైనా

మొదటి పేజీ తరువాయి...

ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది.ఎరువుల ఎగుమతుల్లో ప్రపంచంలో నెం.2గా ఉన్న చైనా వీటి ఎగుమతులపై ఆంక్షలకు సిద్ధమైంది. ఎగుమతుల్లో కోత పెట్టాలని చైనా ఆర్థిక ప్రణాళిక సంస్థ ఎన్‌డీఆర్‌సీ దేశీయ సంస్థలకు సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో జెట్ ఫ్యుయెల్, డీజిల్, కిరోసిన్‌ల ఎగుమతులను తగ్గించాలని గత నెలలో ఎన్‌డీఆర్‌సీ సూచించింది. దేశీయ ఇంధన, ఆహార అవసరాల కోసం చైనా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. చైనా ఎరువులు ఆస్ట్రేలియా, వియత్నాం వంటి దేశాలతో పాటు భారత్‌కూ ఎగుమతి అవుతుంటాయి. కొన్ని దేశాలకు ఎగుమతులను నిలిపివేయాలని తమకు ఆదేశాలు అందాయని షాండాంగ్ ప్రావిన్స్‌లోని ఒక ఫర్టిలైజర్ సంస్థ అధికారి పేర్కొన్నారు. అయితే, ఈ ఆంక్షల విషయమై చైనా ఇంకా అధికారికంగా స్పందించలేదు. ఎగుమతులకు బ్రేకులు తప్పవని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడు తున్నాయి. దేశీయ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు చైనా అన్ని చర్యలు తీసుకుంటుందని అంటున్నాయి. ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ డేటా ప్రకారం, ఎరువుల ఎగుమతుల్లో రష్యా నెం.1 కాగా రెండో స్థానంలో చైనా ఉంది. జెట్ ఫ్యుయెల్ ఎగుమతి చేసే దేశాల్లో చైనా ఆరవ స్థానంలో ఉంది. అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం డేటా ప్రకారం.. జెట్ ఇంధనం, డీజిల్, కిరోసిన్‌ల విదేశీ రవాణాను నిలిపివేయాలని చైనా జాతీయ అభివృద్ధి, సంస్కరణల కమిషన్ అక్కడి పరిశ్రమ వర్గాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్చి మధ్య నుంచే నైట్రోజన్, పొటాషియం ఎరువుల మిశ్రమాలపై నిబంధనలు విధించింది. ఇప్పటికే యూరియా ఎగుమతిని బ్యాన్ చేసిన బీజింగ్.. అమ్మోనియా సల్ఫేట్ ఎగుమతికి మాత్రం అనుమతినిచ్చింది. ఇంధన, ఆహార నిల్వలు పరిరక్షించుకోవడానికి, దేశీయ మార్కెట్‌ను కాపాడుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. అయితే భారత్‌కు ఎరువుల ఎగుమతిని నిలిపివేయాలని చైనాలోని షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఓ ఎరువుల తయారీ సంస్థకు ప్రభుత్వ ఆదేశాలు వచ్చినట్లు అక్కడి ఉ ద్యోగులు వెల్లడించారు. బీజింగ్ నుంచి ఆస్ట్రేలియా, వియత్నాం, భారత్ సహా పలు దేశాలు ప్రస్తుతం ఎరువులను దిగుమతి చేసుకుంటున్నాయి. చైనా నుంచి ఎగుమతులు నిలిచిపోవడం వల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల వ్యవసాయ ఆధారిత దేశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎల్ఎన్‌జీ సరఫరా లేకపోవడంతో భారత్‌లోని పలు యూరియా కంపెనీలు పాంట్లను మూసివేసే పరిస్థితులు నెలకొన్నట్లు ఇటీవల పలు సర్వేలు వెల్లడించాయి.

## విద్యా విధానంలో మార్పులు

మొదటి పేజీ తరువాయి...

ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు కొనసాగుతాయని తెలిపారు. చట్టప్రకారమే ఈ దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు. విద్యావిధానంలో మార్పులు చేస్తున్నామని, ఇక పదో తరగతి బోర్డు పరీక్షలు ఉండబోవని అన్నారు.


ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు ఏవని విపక్షాలు ప్రశ్నిస్తుండటంపై కూడా ముఖ్యమంత్రి స్పందించారు. విచారణ జరపకుండానే అరెస్టులు చేయలేం కదా అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావుకు సిద్దిపేటకు చెందిన చక్రధర్ కేసులోనే క్లీన్ చిట్ వచ్చిందని తెలిపారు.

పదేళ్లు బీఆర్ఎస్ చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్లు చేసిన తప్పులకు చెవిలో పువ్వులు కాదని, వీపుపై బండలు పెట్టాలని అన్నారు. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణకు ఇటీవల కేంద్రం అనుమతి ఇచ్చిందని, ఇప్పటికే అరవింద్ కుమార్‌ను సస్పెండ్ చేశామని అన్నారు.

## తగ్గని ఉద్రిక్తతలు

మొదటి పేజీ తరువాయి...

తమ భూభాగాలను లేదా సైనిక స్థావరాలను ఉపయోగించుకోనివ్వవద్దని పశ్చిమాసియా దేశాలను ఇరాన్ కోరింది. ప్రస్తుత సంక్షోభానికి ప్రాంతీయ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలే ముఖ్య కారణమని ఇరాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ స్థావరాల నుంచే తమపై దాడులు జరుగుతున్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాల ప్రకారం.. ఏ దేశం కూడా తన భూభాగాన్ని వేరొక దేశంపై దాడి చేయడానికి మూడవ పక్షానికి ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఇవ్వకూడదని ఇరాన్ గుర్తు చేసింది. అమెరికా దాడులకు సహకరించే లేదా సౌకర్యాలు కల్పించే దేశాలను కూడా దురాక్రమణలో భాగస్వాములుగానే పరిగణిస్తామని, అటువంటి స్థావరాలు తమకు 'లక్ష్యాలు' అవుతాయని ఇరాన్ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయ్ హెచ్చరించారు. తమ సార్వభౌమాధికారంపై దాడులు జరిగితే, అంతర్జాతీయ



చట్టాల ప్రకారం తమను తాము రక్షించుకునే హక్కు తమకు ఉందని ఇరాన్ స్పష్టం చేసింది. సౌదీ అరేబియా వంటి దేశాలు చేస్తున్న వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని, ఈ ప్రాంతంలో అస్థిరతకు అమెరికా, జియోనిస్ట్ (ఇజ్రాయెల్) శక్తులే కారణమని ఇరాన్ విమర్శించింది.

## అంకెల గారడి, అరచేతిలో వైకుంఠం ఈ బడ్జెట్

### కేటి దొడ్డి మండల బిఆర్ఎస్ నాయకులు గాజుల కృష్ణ రెడ్డి... రవి,ఆంజనేయులు

గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి20(ప్రభాత ఉదయం)

తెలంగాణ రాష్ట్ర2026-2027 బడ్జెట్ చూస్తే కొత్త సీసాలో పాత సార పోసినట్లు ఉందని కేటి దొడ్డి మండల బి.ఆర్.ఎస్ నాయకులు ఆరోపించారు. శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో కేటి దొడ్డి మండల బిఆర్ఎస్ నాయకులు గాజుల కృష్ణ రెడ్డి,నక్క రవి,ఆంజనేయులు మాట్లాడుతూ...అన్ని వర్గాలను దగా, నయవంచన చేసిన బడ్జెట్ అని విమర్శించారు.ఎస్సీ, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు, అగ్రవర్ణ పేదలను నట్టేట ముంచిన బడ్జెట్ అని ఎద్దేవా చేశారు.కేసీఆర్ ఎప్పుడో చెప్పారు,తప్పిదారి కాంగ్రెస్కు ఓటు వేస్తే రైతుబంధుకు రామ్ రామ్, దళిత బందుకు జై భీమ్ అని అన్నారని గుర్తు చేశారు.ఆ మాటలను రేవంత్ సర్కార్ నిజం చేస్తుందన్నారు.కౌలు రైతుల ఊసు లేదు ఆటో వాళ్లకు, ఆర్టీసీ కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు.మహిళలకు, విద్యార్థినులకు అవమానం జరిగిందన్నారు.ఉద్యోగులకునిరుద్యోగులకు దగా జరిగిందన్నారు.ఏదైనా ఎలక్షన్ ఈ మధ్యలో వచ్చిందొ దాని ఫలితాలతో రేవంత్ సర్కార్ కూలిపోతదన్నారు.కానీ కెసిఆర్ చెప్పినట్లు కాంగ్రెస్కు ఓటు వేస్తే మోసపోతము, గోసపడుతాము అన్న మాటలు నిజమవుతున్నాయి. భూమి సూర్యుని చుట్టూ తిరుగుతుందని మనందరికీ తెలుసు కానీ,రేవంత్ సర్కారు ఏ పని చేసినా భూముల చుట్టూ తిరుగుతుంది. రియల్ ఎస్టేట్ దందా మాత్రమే గుర్తుకొస్తుంది. ఐదు బడ్జెట్లలో మూడు బడ్జెట్లు ఈరోజుతో పూర్తయినవి. మిగిలినవి రెండు మాత్రమే. కానీ వీళ్ళిచ్చిన హామీలలో



ఏ ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేకపోయారు. ప్రజలందరూ అన్ని విషయాలు గమనిస్తూ ఉన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాజకీయంగా సమాధి చేయటం ఖాయం.



# నేడే రంజాన్ ఈద్-ఉల్-ఫితర్

## భారత్‌లో కనిపించిన నెలవంక..

**రాజేంద్రనగర్,మార్చి20(ప్రభాత ఉదయం)**

రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ముగిశాయి. శుక్రవారం భారత్లో నెలవంక కనిపించింది.దీంతో దేశవ్యాప్తంగా ముస్లింలు శనివారం ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్)పండగ జరుపుకుంటారు.వాస్తవానికి శుక్రవారమే రంజాన్ ఉంటుందని తొలుత అంతా భావించారు.కానీ ముందురోజు నెలవంక కనిపించకపోవడంతో ప్రభుత్వం సాధారణ పని దినంగా ప్రకటించింది.అయితే..వెంటనే పరిస్థితిని పరిశీలించిన ప్రభుత్వం రంజాన్ పండుగను శనివారం జరుపుకోవాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా శనివారం అధికారికంగా సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ మాసంలో కఠిన ఉపవాస దీక్షల అనంతరం ఈ వేడుకను జరుపుకోనున్నారు ముస్లిం సోదరులు.మనిషిలోని చెడు భావనల్ని,అధర్మాన్ని,ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ 'ఈద్-ఉల్-ఫితర్' అని ముస్లింలు భావిస్తారు.



నీటి సంరక్షణపై గోడ పత్రిక విడదల చేస్తున్న అసోసియేషన్ సభ్యులు, జలమండలి అధికారులు.

# నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత:

## సైబరాబాద్ జలమండలి ఈడీ సంతోష్

### హఫీజ్‌పేట జలమండలి కార్యాలయంలో 'ప్రపంచ జల దినోత్సవ' గోడ పత్రిక ఆవిష్కరించిన అధికారులు

**శేరిలింగంపల్లి : మార్చి 20, (ప్రభాత ఉదయం)**

భూగర్భ జలాల రక్షణ నీటి పొదుపుపై అవగాహన కల్పించడం ప్రతి పౌరుడి బాధ్యత అని హైదరాబాద్ మహానగర జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన 'ప్రపంచ జల దినోత్సవ' అవగాహన గోడ పత్రికను శుక్రవారం హఫీజ్‌పేటలోని జలమండలి జి.ఎమ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, 15వ డివిజన్ జి.ఎమ్ రమావత్ కృష్ణతో కలిసి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి మార్చి 22ను ప్రపంచ జల దినోత్సవంగా ప్రకటించిందని, ఈ ఏడాది 'నీరు ప్రవహించే చోట సమానత్వం వికసిస్తుంది' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న భూతాపం అడవుల నరికివేత ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని ఫలితంగా వరదలు, కరువులు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి లభ్యత భూమిపై ఉన్న నీటిలో 97 శాతం ఉప్పునీరేనని, కేవలం 3 శాతం మాత్రమే త్రాగునీరు, సాగునీటికి పనికొస్తుందని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80 దేశాలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. పరిశు భ్రత ఆరోగ్యం కలుషిత నీటి వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 40 లక్షల మంది మరణిస్తున్నారని, ముఖ్యంగా చిన్నపిల్లలు అతిసార వ్యాధుల బారిన పడుతున్నారని వివరించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, వాడిన నీటిని పునర్వినియోగం చేయాలని సూచించారు. భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు రాకుండా ఉ ండాలంటే ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వాడాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మారబోయిన సదానంద్ యాదవ్, అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, జి.వి. రావు, శివరామరెడ్డి, జనార్ధన్, ఉమా చంద్రశేఖర్, పాలం శ్రీను మరియు జలమండలి అధికారులు పాల్గొన్నారు.




# ఈటెలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్,మార్చి20(ప్రభాత ఉదయం)**

ప్రజా నాయకుడు బడుగు,బలహీన వర్గాల ఆశకిరణం..పేదల పెన్నిధి..రాష్ట్ర సాధనకై నిరంతరం కృషి చేసిన ఉద్యమ నాయకులు..తెలంగాణ తల్లి ముద్దుబిడ్డ..బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు.. మాల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పుట్టినరోజు సందర్భంగా వారి స్వగృహాన ఏర్పాటు చేశారు.పుట్టినరోజు వేడుకల్లో నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్ బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీ మండలం డివిజన్ పరిధిలోని పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలతో కలిసి బయలుదేరి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేవుణ్ణి చల్లని ఆశీస్సులు దీవెనలతో ఆయన జీవితాంతం ఆయురారోగ్యాలతో జీవితాంతం ఆనందంగా ఉండాలని భవిష్యత్తులో ఎన్నో ఉన్నత పదవులు చేపట్టాలని మనసారా ఆకాంక్షించారు.తెలంగాణ ఉద్యమంలో ఈటెల రాజేందర్ పోషించిన పాత్ర చిరస్మరణీయమని,ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన ఎల్లప్పుడూ ముందుంటారని తోకల శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన రాజకీయ ప్రస్థానంలో ఎదురైన సవాళ్లను అధిగమించి ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని ప్రశంసించారు.భవిష్యత్తులో ఈటెల రాజేందర్ మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని తోకల శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు.

# ఘనంగా వైభవ లక్ష్మీవ్రతం



**రాజేంద్రనగర్, మార్చి20 (ప్రభాత ఉదయం)**

కాటేదాన్ డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్ లో గున్నాల లక్ష్మీ నివాసంలో వైభవ లక్ష్మి వ్రతం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. 11 వారాల పాటు జరుపుకునే ఈ వ్రతం మూడో వారానికి చేరుకుంది. అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరుపుకునే విశేష వ్రతంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. అష్టలక్ష్మి స్వరూపిణి అయిన లక్ష్మీదేవిని ఆరాధించడం వల్ల సుఖ సంతోషాలు, ఆష్ఠ ఐశ్వర్యాలు, సిరిసంపదలు కలుగుతాయని భక్తులకు ఆపరా నమ్మకం. పూజ కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.పూజ కార్యక్రమాలలో బాలమణి, సునీత, కవిత, రాధిక, స్వప్న, ధ్రువీక, ప్రతీక, అమృతమ్మ లు పాల్గొన్నారు.



లలితా శాస్త్రాణాం స్తోత్రం కార్యక్రమం నిర్వహిస్తున్న మహిళలు

# చైతన్య విల్లాస్ రామాలయంలో ప్రారంభమైన శ్రీరామనవమి ఉత్సవాలు

## భక్తిశ్రద్ధలతో లలితా శాస్త్రాణాం స్తోత్రం

**రాజేంద్రనగర్, మార్చి20 (ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఉప్పరపల్లి చైతన్య విలాస్ కాలనీలో శ్రీరామనవమి ఉ త్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. శుక్రవారం కాలనీకి చెందిన మహిళలు సామూహికంగా లలితా శాస్త్రాణాం స్తోత్రం కార్యక్రమం నిర్వహించారు. ఉగాది నుండి శ్రీరామనవమి వరకు ప్రతిరోజు ఆలయంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ శ్రీరామనవమి వేడుకల నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగేది శూన్యం అంకెల గారడి మాత్రమే

## ఆరు గ్యారెంటీలకు కేటాయింపులు లేవు:

### కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్

**రాజేంద్రనగర్,మార్చి20(ప్రభాత ఉదయం)**




తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ప్రజలను మోసం చేసేదిగా ఉ ందని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు,మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ విమర్శించారు.బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగేది శూన్యమని పేర్కొన్నారు. మహిళలు,పేద ప్రజలను, నిరుద్యోగులను వంచించిన బడ్జెట్ అని ఆరోపించారు.ఆరు గ్యారంటీలకు మంగళం పాడిన బడ్జెట్ అని పేర్కొన్నారు.ప్రజలకు ఉపయోగపడే స్కీమ్‌లకు సరైన కేటాయింపులు లేవని,అవినీతి అవకాశాలు ఉన్న ప్రాజెక్టులకు భారీ నిధులు కేటాయించారని వెల్లడించారు.గత సంవత్సరం బడ్జెట్ అంచనాలను ఈ ప్రభుత్వం అందుకోలేక పూర్తిగా విఫలమైందని ఇప్పటికే స్పష్టమైందని అన్నారు.అయినా కూడా మళ్లీ అదే విధంగా అంకెల మాయాజాలంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని అన్నారు.కోటి 58 లక్షల మహిళలకు ఇస్తానన్న రూ. 2,500 చేయూత పథకం ప్రస్తావనే లేదు.వృద్ధులకు, ఒంటరి మహిళలకు,వితంతువులకు పెన్షన్‌ను రూ.4 వేలకు పెంపు కేటాయింపులు లేవు.తులం బంగారం హామీ పూర్తిగా మర్చిపోయారు.జాబ్ క్యాలెండర్‌ను పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు.రైతు భరోసా పేరుతో హామీలు ఇచ్చినా,ఇప్పటివరకు మూడు పంటలకు ఎగ్గొట్టారని,ఆచరణకు సాధ్యం కానీ రాజీవ్ యువవికాసానికి మాత్రం బడ్జెట్ లో ప్రతి సారి కేటాయింపులు చేస్తూ వస్తున్నారని ఆరోపించారు.ఈ ప్రభుత్వానికి భూములపై ఉన్న ప్రేమ,ప్రజలకు ఇచ్చిన హామీలపై లేదని తెలిపారు.

# నేడు ఆహార భద్రత నమోదు మేళా డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ స్వాతి

**రాజేంద్రనగర్,మార్చి20(ప్రభాత ఉదయం)**



ప్రజా పాలన పట్టణ ప్రణాళికలో భాగంగా ఈనెల 21వ తేదీన ఆహార భద్రత నమోదు మేళా నిర్వహించడం జరుగుతుందని డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ స్వాతి తెలిపారు.చిన్న స్థాయిలో ఆహార పదార్థాలు విక్రయించే వ్యాపారులు ఈ మేళాకు హాజరై తమ ఎఫ్ఎస్ఎస్ఏఐ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు.ఈ మేళా రాజేంద్రనగర్ కిస్మత్పూర్ జీహెచ్ఎంసీ సర్కిల్ ఆఫీస్‌లో ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.ఈ మేరకు వినియోగించుకోవాలని సూచించారు.



ఆరాంఘర్ చౌరస్తాలో నేలకొరిగిన చెట్టు

# ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు

**బుద్వేల్, మార్చి 20 (ప్రభాత ఉదయం) :**

గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాలలో చెట్లు నేలకొరిగాయి. ఆరాంఘర్ చౌరస్తా సమీపంలోని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు ఓ చెట్టు నేలకొరగడంతో ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. రాజేంద్రనగర్ సర్కిల్ సిబ్బంది ఆ చెట్టును రోడ్డు నుంచి దూరంగా జరిపారు. రాజేంద్రనగర్ ఎన్ఐఆర్డీ రోడ్డు లో చెట్టు నేలకొరగడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. జీహెచ్ఎంసీ సిబ్బంది ఆ చెట్లను రోడ్ల పైనుంచి తొలగించి ట్రాఫిక్ కు ఇబ్బందులు లేకుండ జాగ్రత్తలు తీసుకున్నారు.

# ద నేషనల్ అంబేద్కర్ సేన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జిగా పంబాల రాజు

**బుద్వేల్, మార్చి 20 (ప్రభాత ఉదయం)**



ద నేషనల్ అంబేద్కర్ సేన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి గా రాజేంద్రనగర్ అంబేద్కర్ నగర్ బస్తీకి చెందిన పంబాల రాజు నియమితులైనారు. సంఘం జాతీయ అధ్యక్షులు మన్నె శ్రీధర్ రావు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంబాల రాజు మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గం లో ఉ న్నటువంటి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

# శాసనమండలి విప్ బల్మూరి వెంకట్‌కు అభినందనలు

**బుద్వేల్, మార్చి 20 (ప్రభాత ఉదయం)**

విద్యార్థి ఉద్యమాలలో కలసి పనిచేసిన సహచర మిత్రులు, శాసనమండలి సభ్యులు బల్మూరి వెంకట్ శాసనమండలి విప్ గా నియమితులైన సందర్భంగా శు క్రవారం ఆయనను కలసిన వెటర్నరీ పూర్వ విద్యార్థి సంఘం నాయకులు డాక్టర్ కాటం శ్రీధర్ అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో బల్మూరి వెంకట్ మరిన్ని ఉన్నత పదవులు అదిరోహించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానన్నారు.



శాసన మండలి విప్ బల్మూరి వెంకట్ ను అభినందిస్తున్న డాక్టర్ కాటం శ్రీధర్

# రంజాన్ చివరి శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు

**బుద్వేల్, మార్చి 20 (ప్రభాత ఉదయం)**



తండ్రి కొడుకుల ఆలింగనం

రంజాన్ మాసం చివరి రోజైన శుక్రవారం రాజేంద్రనగర్, బిఅత్తాపూర్ సర్కిళ్లలలోని మసీదు లలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 30 రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు చేసిన ముస్లీం సోదరులు శనివారం రంజాన్ పండుగను నిర్వహించుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. రంజాన్ సందర్భంగా రాజేంద్రనగర్, సులేమాన్ నగర్ ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి సిద్ధం అవుతున్నారు. ప్రార్థనల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏసీపీ తుల శ్రీనివాస్, రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్దేవుపల్లి పోలీస్ స్టేషన్ల ఇన్స్ పెక్టర్ లు ముత్తు యాదవ్, కె నాగేశ్వర్ రావు , సత్యనారాయణ లు బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నారు. ముస్లీం సోదరులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి, ప్రకాశ్ గౌడ్, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డిలు శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పండుగ అందరి జీవితాలలో వెలుగులు నింపాలని మాజీ కౌన్సిలర్ మహ్మద్ షరీఫ్ కోరారు.

# నేడు అత్తాపూర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఆహార భద్రత నమోదు మేళా

**బుద్వేల్, మార్చి 20 (ప్రభాత ఉదయం)**



ప్రజా పాలన, పట్టణ ప్రణాళిక కార్యక్రమంలో బాగంగా శనివారం ఉదయం 10 గంటలకు బుద్వేల్ లో గల అత్తాపూర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో అహార భద్రత నమోదు మేళా కార్యక్రమం ఉంటుందని డిప్యూటీ కమిషనర్ వి సమ్మయ్య ఓ ప్రకటనలో తెలి పారు. చిన్న చిన్న అహార పదార్థాలు విక్రయించే వ్యాపారులు ఈ మేళ కు వచ్చి ఎఫ్ఎస్ఎస్ఏఐ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**రైతులు తమకు అవసరమైన యూరియాను నూతనంగా వచ్చిన యాప్ ద్వారా బుక్ చేసుకోవాలి**

**నిబంధనల ప్రకారం గ్యాస్ బుకింగ్ చేసుకుంటే ప్రతిరోజు పద్ధతి ప్రకారంగా డెలివరీ చేయడం జరుగుతుంది**

**కేజీబీవీ ఇలలో మెనూ ప్రకారం వంటలు చేయకుంటే చర్యలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి20(ప్రభాత ఉదయం)**



అధికారులు, ఇతర సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. శు క్రవారం ఐజ పిహెచ్ సి ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి వైద్య సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లో సరైన సంతకాలు చేయకపోవడం, లీవ్ లెటర్ ఇవ్వకుండా గైర్హాజరు కావడం, సంతకం పెట్టి విధులు నిర్వహించకుండా వెళ్లిపోవడం వంటి పలు కారణాలతో 9 మందికి షోకాజు నోటీసులు ఇవ్వాలని డిఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయిను ఫోన్లో ఆదేశించారు. ఒకరిని సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఓపి రిజిస్టర్ ను పరిశీలించి ప్రతిరోజు సుమారు వందకు పైగా రోగులు చికిత్స నిమిత్తం వస్తున్నందున వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఎన్సిడి, ఎర్లీ డేట్ అఫ్ డెలివరీ, తదితర రిజిస్టర్లను పరిశీలించి రికార్డులను సక్రమంగా నిర్వర్తించాలని అక్కడి వైద్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు ఎక్కువగా జరిగేలా అవగాహన కల్పించాలని, సబ్ సెంటర్స్ లోను అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. మందుల స్టోర్లో మెడికల్ కిట్లను పరిశీలించి స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి వార్డులు, ఇతర భవనాల్లో అనవసరమైన ఫర్నిచర్, పాత సామాన్లను వారంలోగా క్లీన్ చేయించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అయిజ పట్టణంలోని అగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. స్టాక్ రిజిస్టర్ ను, ధరల పట్టికను పరిశీలించారు. రైతులు తమకు కావలసిన ఎరువులను నూతనంగా వచ్చిన యాప్ ద్వారా బుక్ చేసుకునే విధానంపై సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. రైతు భరోసా దరఖాస్తుకు ఈనెల 25 చివరి తేదీ కాబట్టి అర్హులైన రైతులందరూ సద్వినియోగం చేసుకునేలా అధికారులు సహకరించాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఈనెల 22న ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడుతున్నందున రైతు వేదికల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.



అలాగే ఐజ లోని లక్ష్మీ శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. నిర్ణీత గడువులోగా గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకున్న వారికి ఓటీపీ నెంబర్ వస్తుందని, నిబంధనలు పాటించకుండా బుక్ చేసుకుంటే ఉపయోగం లేదని అందుకు గల కారణాలు చెబుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సంబంధిత ఏజెన్సీ యాజమాన్యాన్ని ఆదేశించారు. ప్రతిరోజు బుకింగ్స్, సిలిండర్ల డెలివరీ, తదితర అంశాల గురించి కలెక్టర్ మాట్లాడారు. వినియోగదారులు అనవసరంగా గ్యాస్ ఏజెన్సీ కార్యాలయాల వద్ద బారులు తీరకుండా వారికి అవసరమైన సమాచారాన్ని అందజేసేందుకు హెల్ప్ డెస్క్లను కూడా ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్ కు ఆదేశించారు. చివరగా ఐజ కేజీబీవీని సందర్శించిన జిల్లా కలెక్టర్ అక్కడ వంటగదిలో వండిన పదార్థాలను పరిశీలించి, మెనూ ప్రకారం వంటలు చేయకుంటే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డార్మెటరీ మరమ్మత్తులు ఉన్నందున విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, విద్యాలయం అభివృద్ధికి అవసరమైతే అదనపు నిధులను మంజూరు చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందజేస్తున్న ఆహారం, ఇతర సౌకర్యాలపై వాకబు చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే విద్యార్థులు తన దృష్టికి తీసుకురావాలని, తప్పకుండా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.



డ్రా తీస్తున్న అధికారులు

## ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పిఎంఎంఎస్వై) పథకం కింద లబ్ధిదారుల ఎంపిక

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 20(ప్రభాత ఉదయం):**

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, పిఎంఎంఎస్వై (ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన) పథకం కింద మోటార్ సైకిల్తో పాటు ఐస్ బాక్స్ల యూనిట్లను లబ్ధిదారులకు అందించేందుకు గాను,జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి కమిటీ ఛైర్మన్ సందీప్ కుమార్ ఝా ఎంపిక చేశారు.జిల్లాకు కేటాయించిన మొత్తం 13 యూనిట్లకు గాను 101 దరఖాస్తులు రాగా, వాటిలో 94 దరఖాస్తులు ఎంపిక కాగా, ఈ ఎంపికలో పారదర్శకత పాటిస్తూ, జనరల్ (40 శాతం), మహిళలు (60 శాతం), ఎస్సీ, ఎస్టీ (60 శాతం) కోటా ప్రకారం జనరల్ కేటగిరీ నుంచి 8 మంది, ఎస్సీ కేటగిరీ నుంచి ఇద్దరు, ఎస్టీ కేటగిరీ నుంచి ఒకరు, మహిళా కేటగిరీ నుంచి ఇద్దరు లబ్ధిదారులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరవేసే దిశగా కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా చేపల వ్యాపారంలో ఉన్న వారికి సౌకర్యవంతమైన రవాణా, నిల్వ సదుపాయం కల్పించి, వారి ఆదాయాన్ని పెంచడమే లక్ష్యం అని పేర్కొన్నారు. అదే విధంగా ఎంపికైన లబ్ధిదారులకు మే 8న వాహనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారి రాణా ప్రతాప్, డీఏఓ అంబికా సోనీ, జిల్లా ఫిషరీస్ ఛైర్మన్ నీల రాజు, ఇతర కమిటీ సభ్యులు, సొసైటీ సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

## 65 సం.లు నిండిన ప్రతి రైతులకు 5000 వేల పెన్షన్ ఇవ్వాలి

**రైతు భరోసా, రైతు సమస్యల గురించి కలెక్టర్ కు వినతిపత్రం**

**తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఆది సాయన్న**

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి20(ప్రభాత ఉదయం):**

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం 65 సంలు నిండిన ప్రతి రైతులకు 5000 వేల పెన్షన్ ఇవ్వాలని, రైతు భరోసా రైతు సమస్యల గురించి, వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం జిల్లా కలెక్టర్ కు అందచేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఆది సాయన్న, ప్రధాన కార్యదర్శి సొప్పరి సోమయ్య లు మాట్లాడుతూ గత సీజన్ రైతు భరోసా ఇవ్వాలని, పంటల భీమ పథకం రాష్ట్ర స్థాయిలో అమలు చేయాలని, రైతులకు 2లక్షల పైన ఉన్న ఋణాలను కూడా పూర్తి స్థాయి ఋణ మాఫీ చేయాలని, మొక్క జొన్న పంటలను మార్కెట్ల ప్రభుత్వం ద్వారా రూ॥ 2400/-లకు క్వింటాలు కొనుగోలు చేయాలని, యూరియాను రైతులకు యాప్ ద్వారా అందించే విధానంలో లోపాలను సరిదిద్ది సులభతరంగా అందించాలన్నారు. కౌలు రైతులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, తుఫాను వల్ల నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, మహిళా రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, భారత అమెరికా వాణిజ్య ఒప్పందంపై సంతకం చేయవద్దని విద్యుత్ సవరణ చట్టం, విత్తన బిల్లును ఉపసంహరించుకోవాలని,భూభారతి డ్రైక్లీన్స్, సాదాబైనామాకు సంబంధించి సవరించి అమలుచేయాలని తదీతర ప్రధానమైన సమస్య లను ప్రభుత్వం పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బెజగం చంద్రయ్య, ఉప్పల ఐలయ్య, ఊదరి వెంకటాద్రి, భూమాండ్ల ఐలయ్య, కంబాల యాదలక్ష్మి, సిద్దులు, జాయ నగేష్ తదితరులు పాల్గొన్నారు.



వనిత టి స్టాల్ ను తనిఖి చేస్తున్న ఫుడ్ ఇన్స్పెక్టర్

## వనిత టీ స్టాల్, విజయ మిల్క్ పార్లర్ మహిళలపై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వేధింపులు ఆపాలి

**పెద్ద, హోటల్స్, వ్యాపార సముదాయలను వదలిపెట్టి, వనిత టీ స్టాల్, విజయ మిల్క్ పార్లర్ ఫుడ్ ఇన్స్పెక్టర్ తనిఖీ**

**జిల్లా కలెక్టర్ పనితీరు పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంగా ఉందని**

**ఖండించిన సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొట్ల శేఖర్...**

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 20(ప్రభాత ఉదయం):**

జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు డ్వాక్రా గ్రూపు మహిళలు పాలమాకుల చిన్న మంజుల, పుత్కనూరి విజయలక్ష్మి కి వనిత టీ స్టాల్, మిల్క్ పార్లర్ శాంక్షన్ చేసిన సంగతి అందరికీ తెలిసిందే. గత పది రోజులుగా జనగామ జిల్లాకు కొత్తగా వచ్చిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వీటిని తొలగించాలని ప్రోక్ క్రేన్లు, జెసిపిలు రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ సిబ్బందితో బాధిత మహిళాలను భయభ్రాంతులకు గురిచేసి ఇబ్బందులు పెడుతుంటే దిక్కుతో తోచక బాధిత మహిళలు హైకోర్టును ఆశ్రయించి ఔ/ా 8348 శీట 2026 పిటిషన్ హైకోర్టు ఏప్రిల్ 4 వ తారీఖు వరకు ఈకేసు విషయమై వాయిదా వేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను గౌరవించాల్సిన జిల్లా మెజిస్ట్రేట్ అయ్యుండి జిల్లా కలెక్టర్ బాధిత మహిళలపై వేధింపులకు వివిధ డిపార్ట్మెంట్లో అడ్డం పెట్టుకొని దాడులకు పాల్పడడం, తన పరపతి నడవటం లేదని జీర్ణించుకోలేని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం దుకాణాలు తెలిసిన వెంటనే ఆగమేఘాల మీద ఫుడ్ ఇన్స్పెక్టర్ వినీల్ ని, వారి సిబ్బందిని పంపి తనిఖీల పేరుతో వారిని ఇబ్బంది పెట్టి తెల్ల కాగితాల మీద బలవంతంగా సంతకాలు పెట్టించక పోయారు. ఇది వేధింపులకు పాల్పడడం తప్ప మరొకటి కాదని, జిల్లా కేంద్రం లో అనేక పెద్ద హోటల్స్, వ్యాపారం సముదయాలను వదిలిపెట్టి, వీరి పైన తనిఖీ చేయడం పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంగా ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్ అన్నారు. సాధారణ డ్వాక్రా గ్రూపు మహిళల పట్ల కక్ష కట్టి కలెక్టర్ జిల్లా స్థాయి అధికారులను అన్ని విభాగాల అధికారులను ఉసిగొల్పడం చూస్తే ఇది దేనికి నిదర్శనం ప్రభుత్వ లక్ష్యాన్ని ప్రభుత్వ అధికారుల బద్నాం చేయడం కాదా అని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ బేషజాలకు పోకుండా, పేద డ్వాక్రా గ్రూపు మహిళల పట్ల తనకున్న వైఖరిని మార్చుకొని వారికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి చందు నాయక్, జనగామ జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు, జిల్లా నాయకులు తుంగ కౌశిక్, తదితరులు ఉన్నారు.

## ఉత్సాహంగా సందె రాళ్ల పోటీలు

**గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి20(ప్రభాత ఉదయం)**



ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ధరూర్ మండ ల పార్చర్ల గ్రామంలో యూత్ కమి టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సందె రాళ్ల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీ లకు వివిధ గ్రామాలకు చెందిన యువకులు 80,, 85 కేజీల రాళ్లు ఎత్తే పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతి సర్వేష్ (83.5 కేజీల బరువు) రూ.2500 నగదు బహుమతిని వాల్మీకి సంఘం నాయకులు లక్ష్మన్న అందజేశారు



## అచలగురు శ్రీ శ్రీధర శివరామ దీక్షిత సాంప్రదాయకం..

**రాజేంద్రనగర్,మార్చి20(ప్రభాత ఉదయం)**

మహాయోగిని శేషమాంబశాఖ శ్రీకోట్ల నాగాయార్యుల ప్రియశిష్యరత్నంబగు సమరసానంద ముంగిమళ్ళ కోట్ల నల్లయార్యుల అచలగురు మందిరం రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ బాబుల్ రెడ్డినగర్ లో నూతన ఆశ్రమ నిర్మాణానికి అదనపు గది సోమ శ్రీనివాస్,నీరజ,లు నిర్మాణముకు భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో మందిరం పెద్దలు సందుల హన్మంత్ సాగర్,జక్కులపల్లి వెంకటయ్య,సందుల నారాయణ సాగర్,పల్లపు జగన్,పోతురాజు మల్లేష్,ఎటి రాములు,పెద్ద హనుమంత్, సాగర్,శంకర్,మణ్ణమ్మ,తిప్పన్న,బాలకృష్ణ,పాపిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కోలుకొండ పాఠశాల ఆవరణంలో పాన్ షాప్ నిర్వహిస్తున్న వ్యకి పై కేసు నమోదు

**పాఠశాలలు, కళాశాల కి 100 మీటర్ల సమీపంలో పాన్ షాప్ లు నిర్వహించారాదు**

**నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు**

**దేవరుప్పల ఎస్ఐ ఊర సృజన్ కుమార్**

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 20(ప్రభాత ఉదయం):**

పాఠశాలలు, కళాశాల కి 100 మీటర్ల సమీపంలో పాన్ షాప్ లు నడిపే వారిపై కేసులు నామోదు చేయాలని వరంగల్ పోలీస్ కమీషనర్ సూచనల మేరకు జిల్లా లోని దేవరుప్పుల మండల పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ) ఊర సృజన్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలం మొత్తం తనిఖీలు చేశారు. మండలం లోని కోల్కొండ గ్రామం స్కూల్ ఆవరణలో పాన్ షాప్ నిర్వహిస్తున్న రాజశేఖర్ అనే వ్యక్తి పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఊర సృజన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పొగాకు, మత్తు పదార్థాలు ఎవరు అమ్మిన వారిపై కేసు నమోదుచేయడం జరుగుతుందని, సిగరెట్ తో పాటు ఇతర పొగాకు ఉత్పత్తులు మైనర్ లకు అమ్ముతు పట్టుబడితే వారి పై కఠిన చర్యలు తిసుకోబడుతుందని, పొగాకు, మత్తు పదార్థాలు ఎవరు అమ్మిన, 100 మీటర్ల అవతల మైనర్ లకు వాటిని విక్రయిస్తే వారి పై కేసు నామోదు చేయడము జరుగుతుందని తెలిపారు.

## రాష్ట్ర బడ్జెట్ రైతన్నలకు ఒక వరం

**కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి**

**కొత్తకోట, మార్చి20 ( ప్రభాత ఉదయం)**



రాష్ట్ర అసెంబ్లీలో శుక్రవారం రాష్ట ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ అన్నదాతలకు ఎంతో దోదపడుతుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ వనపర్తి జిల్లా అధ్యక్షులు వేముల శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా బడ్జెట్ లో పొందుపరిచిన అంశాలపై పార్టీ నాయకులత కలిసి వేముల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ...రాష్ట్ర రైతన్నలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజును చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుందన్నారు.బడ్జెట్లో వ్యవసాయం, రైతు సంక్షేమం కోసం రూ,23,179 కోట్లు ,సాగునీటి ప్రాజెక్టులు రూ,22,615 కోట్లు కేటాయించడం, పశుసంవర్ధ శాఖకు 1,525 కోట్లు చూస్తే ఇది పూర్తిగా రైతు ప్రభుత్వం గా నిరూపితంగా రుజువైందన్నారు.సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో సాగుభూమి పెంపు ప్రధాన లక్ష్యంగా రైతులకు సాగునీటి విస్తరణ కోసం ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిపై ఎక్కువ దృష్టి పెట్టి నిధులు ఎక్కువ రావడం వల్ల ఉమ్మడి జిల్లాలలోని పంట పొలాలకు సాగునీరు అందుతుందన్నారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు, భీమా, నెట్టెంపాడు, కల్వకుర్తి,కోయిల్ సాగర్, డిండి, గూడెం దొడ్డి, గట్టు ఎత్తిపోతల ప్రాజెక్టులపై దృష్టి పెట్టి నిధులు కేటాయించడం పట్ల పంట పొలాలకు సాగనీరు అందుతుందని ఆశిస్తూ లిప్రభుత్వానికి హర్షం వ్యక్తం చేస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో వనపర్తి కిసాన్ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, పెద్దమందడి కిసాన్ సెల్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి,గణపురం కిసాన్ సెల్ అధ్యక్షుడు బాల్ రెడ్డి పాల్గొన్నారు.



## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ కార్యశాల

**గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి20(ప్రభాత ఉదయం)**

పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్-2026 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేటిదొడ్డి మండలం వెంకటాపురంలో శిక్షణ తరగతుల్లో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు హాజరై.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకితీసుకెళ్లడం, క్షేత్రస్థాయిలో సంస్థాగత బలోపేతం,కార్యకర్తల పాత్ర, క్రమశిక్షణ అంశాలపై నాయకులకు,కార్యకర్తలకు వివరించారు. సంస్థ పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు,ప్రజలతో సాన్నిహిత్యం వంటి అంశాలపై సమగ్రమార్గనిర్దేశం అందిస్తూ బూత్ స్థాయి నుంచి పార్టీనిర్మాణాన్ని బలోపేతం చేయడమే ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు భవిష్యత్ రాజకీయ, సామాజిక సవాళ్లనుఎదుర్కొనేలా కార్యకర్తలను తీర్చిదిద్దుతూ సమర్థవంతమైన నాయకత్వాన్ని రూపొందించేందుకు ఈకార్యక్రమం ఒక బలమైన వేదికగా నిలుస్తుంది అని పేర్కొన్నారు.పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనలు,అంత్యోదయ సూత్రం, సమాజంలోని చివరి వ్యక్తి వరకుఅభివృద్ధి ఫలాలు చేరేలా పార్టీ కార్యకర్తలు కట్టుబడి పనిచేయాల్సిన అవసరాన్ని వివరించారు. సంస్థ పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, సేవాభావం, ప్రజలతోసాన్నిహిత్యం వంటి అంశాలపై కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ఎక్బోటే, ప్రశిక్షణ జిల్లా కన్వీనర్ శ్యామ్ రావ్, మండల అధ్యక్షుడు శ్రీపాద రెడ్డి , అనిమి రెడ్డి, మైల గడ్డ రాములు, మండల నాయకులు పాల్గొన్నారు..



నీటి సంరక్షణపై గోడ పత్రిక విడదల చేస్తున్న అసోసియేషన్ సభ్యులు, జలమండలి అధికారులు.

# నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత:

## సైబరాబాద్ జలమండలి ఈడీ సంతోష్

### హాఫీజ్‌పేట జలమండలి కార్యాలయంలో 'ప్రపంచ జల దినోత్సవ' గోడ పత్రిక ఆవిష్కరించిన అధికారులు

**శేరిలింగంపల్లి : మార్చి 20, (ప్రభాత ఉదయం)**

భూగర్భ జలాల రక్షణ నీటి పొదుపుపై అవగాహన కల్పించడం ప్రతి పౌరుడి బాధ్యత అని హైదరాబాద్ మహానగర జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంతోష్ పేర్కొన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన 'ప్రపంచ జల దినోత్సవ' అవగాహన గోడ పత్రికను శుక్రవారం హాఫీజ్‌పేటలోని జలమండలి జి.ఎమ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, 15వ డివిజన్ జి.ఎమ్ రమావత్ కృష్ణతో కలిసి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి మార్చి 22ను ప్రపంచ జల దినోత్సవంగా ప్రకటించిందని, ఈ ఏడాది 'నీరు ప్రవహించే చోట సమానత్వం వికసిస్తుంది' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెరుగుతున్న భూతాపం అడవుల నరికివేత ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటోందని ఫలితంగా వరదలు, కరువులు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి లభ్యత భూమిపై ఉన్న నీటిలో 97 శాతం ఉప్పునీరేనని, కేవలం 3 శాతం మాత్రమే త్రాగునీరు, సాగునీటికి పనికొస్తుందని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 80 దేశాలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. పరిశు భ్రత ఆరోగ్యం కలుషిత నీటి వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 40 లక్షల మంది మరణిస్తున్నారని, ముఖ్యంగా చిన్నపిల్లలు అతిసార వ్యాధుల బారిన పడుతున్నారని వివరించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని, వాడిన నీటిని పునర్వినియోగం చేయాలని సూచించారు. భవిష్యత్తులో నీటి కోసం యుద్ధాలు రాకుండా ఉ ండాలంటే ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వాడాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారందరితో నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మారబోయిన సదానంద్ యాదవ్, అమ్మయ్య చౌదరి, శివరామకృష్ణ, జి.వి. రావు, శివరామరెడ్డి, జనార్ధన్, ఉమా చంద్రశేఖర్, పాలం శ్రీను మరియు జలమండలి అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షా చేస్తున్న జిల్లా కలెక్టర్

# క్షయ (టీబీ ) వ్యాధి నిర్మూలనకు విస్తృత చర్యలు:కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 20(ప్రభాత ఉదయం):**

క్షయవ్యాధి (టీబీ ) నివారణ పైన అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు.ఈ నెల 24 న.. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా చేపట్టాలిసిన కార్యక్రమాల గురించి సంబంధిత అధికారులతో శుక్రవారం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ....క్షయవ్యాధి (టీబీ) నియంత్రణలో ముందస్తు గుర్తింపు, స్క్రీనింగ్, ప్రజల్లో అవగాహన పెంపు పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు.మొదటగా అధిక జనాభా గల ప్రాంతం లో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి నాట్ , మైక్రోస్కోపీ, ఎక్స్-రే ద్వారా నిర్ధారణకు పంపాలని అధికారులకు సూచించారు.డయాబెటిస్, పోషకాహార లోపం, వృద్ధులు ఇతర సహవ్యాధులు ఉన్నవారిని ప్రాధాన్యంగా స్క్రీనింగ్ చేయాలని, అన్ని కేసులను నిక్షయ్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.శాఖల మధ్య సమన్వయం పెంచి కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని, గుర్తించిన టీబీ రోగులకు తక్షణ చికిత్స అందించాలన్నారు.అలాగే టీబీ నివారణకు ముందస్తు గుర్తింపు, వ్యక్తిగత పరిశుభ్రత, బీసీజీ టీకా టీబీ లక్షణాలపై (దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు) ప్రజల్లో అవగాహన పెంపు చేయాలని సూచించారు.జిల్లాలో అధిక ప్రమాదం ఉన్న 44 గ్రామాలు గుర్తించడం జరిగిందని, ఆ గ్రామాల్లో సమగ్ర స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరికీ ఎక్స్-రే, స్పుటమ్ పరీక్షలు, హీమోగ్లోబిన్ (ఎచ్బి ) పరీక్షలు చేయనున్నట్లు ఎన్టిఈపి ప్రోగ్రాం అధికారి డాక్టర్ అశోక్ తెలిపారు.ఈ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వ టీబీ ముక్త భారత్ అభియాన్ 2.0 లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు.ఈ సమావేశంలో డిఎమ్ఎచ్ఓ మల్లిఖార్జున రావు, జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి డాక్టర్ రాజలింగం, జిల్లా ఆసుపత్రుల కో ఆర్డినేటర్ నరేంద్ర శర్మ, ప్రోగ్రాం అధికారులు, ఐఎంఏ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణి

**కేటిదొడ్డి, మార్చి20( ప్రభాత ఉదయం)**

ముస్లింల పవిత్ర పండగ రంజాన్ ను పురస్కరించుకుని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, గద్వాల మార్కెట్ యార్డు చైర్మన్ కుర్వహన్మంతు, మండల అధ్యక్షులు ఉరుకుంద ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు శుక్రవారం రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో పాటించే ఉ పవాస దీక్షలు ఎంతో భక్తి శ్రద్ధలతో పాటిస్తారని, అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ అందరికీ ఉ ండాలని కోరారు. రంజాన్ మాసంలో మత సామరస్యానికి ప్రతీక, మత సామరస్య భావం పెంపొంది ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నారాయణ, వార్డు మెంబర్స్ ఆర్ వీరన్న, జంగిల్ , మెంటల్ వీరన్న , సీనియర్ నాయకులు యుగంధర్ గౌడ్, బి కొండయ్య, డి.వీరేష్, గోవర్ధన్, రంగస్వామి, పెద్దలు పాల్గొన్నారు.



# సీఐ వెంకట సుబ్బారావుకి తెలుగు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జనంపల్లి పురేందర్ రెడ్డి

**కూకట్ పల్లి, మార్చి 20 (ప్రభాత ఉదయం)**

తెలుగు నూతన సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురంధర్ రెడ్డి కూకట్ పల్లి సీఐ వెంకట సుబ్బారావు ని మర్యాదపూర్వకంగా కలిసి షాలవా తో సన్మానం చేసి మిఠాయిలు తినిపించి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎస్సైలు రామకృష్ణ, చంద్రశేఖర్, దీక్షిత, శ్రీను బాబు, క్రైమ్ ఎస్ఐ రవీందర్ రెడ్డి ని కలిసి సన్మానం చేసి ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జనంపల్లి పురంధర్ రెడ్డి మాట్లాడుతూ కూకట్ పల్లి పోలీసు అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి కంటికి రెప్పలా కాపాడుతూ, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి ప్రసాద్ పురుషోత్తం, సూర్యనారాయణ, నాని, శ్రీధర్ రావు, తదితరులు పాల్గొని పోలీస్ అధికారులకు అభినందనలు తెలిపారు. ముఖ్యంగా వివేకానంద నగర్ డివిజన్ ప్రజలకు, కాలనీవాసులకు, నాయకులకు, అధికారులకు, ముఖ్యంగా పత్రిక సోదరులకు, ఎలక్ట్రానిక్ మీడియా సోదరులకు నూతన సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి ప్రాధాన్యతనిస్తూ కీలక నిర్ణయాలు

### సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదములు తెలిపిన తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్

**కూకట్ పల్లి, మార్చి 20 (ప్రభాత ఉదయం)**



ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టడం, డిప్లమా, ఐటీఐ విద్యార్థులకు ప్రతినెల రూ.2000 స్కాలర్షిప్ ప్రకటించడం వంటి నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడతాయని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.26,674 కోట్లు కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రముఖ విద్యాసంస్థ అయిన ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించడం, విద్యా మౌలిక వసతుల మెరుగుదలకు దోహదం చేస్తుందని తెలిపారు. యువత అభివృద్ధి కోసం 'రాజీవ్ యువ వికాసం' పథకానికి రూ.6000 కోట్లు కేటాయించడం యువతకు ఉపాధి అవకాశాలను పెంచే దిశగా కీలక అడుగని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, యువత సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం అని, ఇలాంటి ప్రజా హిత నిర్ణయాలు కొనసాగించాలని ఆయన కోరారు.



# ఘనంగా ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు

### శుభాకాంక్షలు తెలిపిన కంచి మహేందర్

**కూకట్ పల్లి, మార్చి 20 (ప్రభాత ఉదయం)**

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన నివాసంలో సాదరంగా నిర్వహించిన వేడుకలు ఆప్యాయతతో జరిగిన ఈ వేడుకల్లో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు కంచి మహేందర్ పాల్గొని ఈటల రాజేందర్ ను మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకుల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొంది. ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ఆయనకు శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెపల్లి రాజేశ్వర్ రావు కూడా పాల్గొని ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో బాలేష్, అశోక్, శివ, రాధ్య శ్యామ్, వినేత్, డా. కంచి ప్రశాంత్, గోపాల్, సంతు తదితరులు హాజరై ఈటల రాజేందర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ వేడుకలను మరింత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఐక్యతను ప్రతిబింబిస్తూ స్నేహసమ్మేళనంగా నిలిచింది.



# ఆలయ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తా

### జనసేన నాయకులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

**కూకట్ పల్లి, మార్చి 20 (ప్రభాత ఉదయం)**

ఆలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తూ తన వంతు సహకారాలు అందిస్తానని కూకట్ పల్లి జనసేన పార్టీ అధ్యక్షులు ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం, అల్లాపూర్ డివిజన్ వివేకానంద నగర్, గాయత్రీ నగర్ లో వెలసి ఉన్న శ్రీ కనకదుర్గ నాగదేవత సహిత పోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ పులిగోల్ల శ్రీనివాస్ యాదవ్, ప్రెసిడెంట్ కాయితి యాదవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కల్వల ఏడుకొండలు, జనసేన నాయకులు పవన్ నాయుడు ఆహ్వానం మేరకు జనసేన పార్టీ కూకట్‌పల్లి ఇన్చార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ విచ్చేసి అమ్మవారి దర్శనానంతరం ఆలయ నిర్మాణంలో భాగంగా ఆలయ ప్రాంగణం లోని ఫ్లోరింగ్ కీ అవసరమైన గ్రానైట్ ఇస్తానాని హామీ ఇచ్చారు. అనంతరం ఆలయ కమిటీ వారు ప్రేమ కుమార్ ని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ ప్రజల విశ్వాసమే నా బలం దేవాలయ అభివృద్ధి నా బాధ్యత అని మమ్మారెడ్డి ప్రేమ కుమార్ స్పష్టం చేశారు. భక్తుల సహకారంతో ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆత్మూరి మోహన్, పాదం సూర్య, జయమ్మ శ్రీను, గణేశుల నాగేశ్వరరావు, జెల్లా రవి, సూర్యనారాయణ, లలిత, మాత గ్రూప్ సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# రామకృష్ణాపురం గ్రామంలో రంజాన్ తోఫా పంపిణీ

**కొత్తకోట, మార్చి20 ( ప్రభాత ఉదయం)**

కొత్తకోట మండలం రామకృష్ణాపురం గ్రామంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ పరంగా జరుపుకుంటున్న రంజాన్ మాసాన్ని ఎంతో పవిత్రంగా జరుపుకోవాలన్నారు. ఎమ్మెల్యే జిఎంఆర్ సూచన మేరకు శుక్రవారం కొత్తకోట మండలం రామకృష్ణ పురం గ్రామంలో రంజాన్ తోఫా కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల మధ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముస్లిం సోదర సోదరీమణులకు తోపా అందజేశారు.రంజాన్ తోఫా తీసుకున్న ముస్లిం సోదర సోదరీమణులు సీఎం రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్టమైన నిబంధనలు అమలు చేయాలి:

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 20(ప్రభాత ఉదయం):**

పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్టమైన నిబంధనలను అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు.జిల్లాలో జరుగుతోన్న వార్షిక పరీక్షలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు గాను జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా డిపార్ట్మెంటల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్స్ (సిఎస్ )లకు పలు కీలక సూచనలు జారీ చేశారు.

డిపార్ట్మెంటల్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్ లకు కీలక ఆదేశాలు

-పరీక్ష కేంద్ర ప్రాంగణంలోకి మొబైల్ ఫోన్లు ఎవరికీ అనుమతి లేదు.

-పరీక్ష కేంద్రం లోపల వాహనాలు కూడా అనుమతించబడవు.

-క్లినికల్ స్టాఫ్ పరీక్ష పూర్తయ్యే వరకు కేంద్రాన్ని వదిలి వెళ్లకూడదు.

-పరీక్ష ప్రారంభానికి ముందు సీఎస్ లు స్వయంగా కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి.- పరీక్ష గదుల్లో ఎలాంటి మెటీరియల్ లేకుండా ముందుగానే నిర్ధారించాలి.

-పోలీస్ సిబ్బందికి కూడా పరీక్ష కేంద్రం లోపలికి మొబైల్ ఫోన్లు అనుమతించబడవు.

-పరీక్ష కేంద్రం లోపలికి హ్యాండ్ బ్యాగ్‌లకు కూడా అనుమతి లేదు.

-పరీక్ష రాయని ఇతర గదులను తప్పనిసరిగా లాక్ చేయాలి.

-పేపర్ లీకేజ్ వంటి ఘటనలు జరగకుండా సీఎస్ లు పూర్తిగా బాధ్యత వహించాలి.

-ఒక్క బెంచ్‌పై ఒక్క విద్యార్థి మాత్రమే కూర్చునేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి.

ఈ సమావేశంలో ఏసీజీఈ రవి కుమార్, డీసీఈబీ రామరాజు, ఏపీఓ శ్రీధర్, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# కిందికుంట పార్క్‌లో ఘనంగా ఉగాది వేడుకలు

### మాజీ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస రావుకు సన్మానం

**కూకట్ పల్లి, మార్చి 20 (ప్రభాత ఉదయం)**

తెలుగు నూతన సంవత్సరం 'శ్రీ పరాభవ' నామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గం, హైదర్ నగర్ డివిజన్‌లో కిందికుంట పార్క్‌లో తెలుగు భాషా ఉగాది వేడుకలను అత్యంత వైభవంగా కార్పొరేటర్ నార్నే శ్రీనివాస రావు సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, పంచాంగ శ్రవణం స్థానిక ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. హైదర్ నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస రావు కి ఈ కార్యక్రమంలో ఘన సన్మానం జరిగింది. డివిజన్ అభివృద్ధికి ఆయన చేసిన విశేష కృషిని, ప్రజలకు అందించిన సేవలను గుర్తించి, స్థానిక నివాసితులు, నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. తన పదవీ కాలంలో హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పన, పార్కుల అభివృద్ధి, పారిశుధ్య పనులపై నార్నే శ్రీనివాస రావు ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల ప్రతినిధులు, తెలుగు భాషా అభిమానులు, పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు, ప్రజలు పాల్గొని ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608